క్లుప్తంగా

సాహూకు గౌరవ డాక్టరేట్ ప్రదానం



ఒడిశా రాష్ట్ర మంత్రి శ్రీకాంత్ నుంచి డాక్టరేట్ అందుకుంటున్న సంతోష్ కుమార్ సాహూ

ఇచ్ఛాపురం రూరల్: ఎం.తోటూరుకు చెందిన సామాజిక కార్యకర్త సంతోష్ కుమార్ సాహూకు గౌరవ డాక్టరేట్ దక్కింది. ఫార్మసీ, ఆరోగ్య సంరక్షణ సేవా రంగంలో విశేష సేవలందిస్తున్నందుకు నేషనల్ అకాడమీ ఆఫ్ సాక్షరత మిషన్ ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఒడిశా కార్మిక, ఉద్యోగ శాఖామంత్రి శ్రీకాంత్ నుంచి సాహూ డాక్టరేట్ అందుకున్నారు. రెండు దశాబ్దాలుగా తాను చేస్తున్న సేవలకు డాక్టరేట్ దక్కిందని, భవిష్యత్‌లో ఫార్మసీ రంగంలో మరిన్ని సేవలు అందిస్తానని సాహూ చెప్పారు.

వరిపైరుకు తెగుళ్లు

కవిటి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో బొరివంక బీల ప్రాంతంలో వరి పైరుకు అగ్గి, పాము పొడ తెగుళ్లు సోకాయని మండల వ్యవసాయాధికారి పి.శ్రీదేవి తెలిపారు. రైతులు తమ పంట పొలాను పరిశీలించాలని కోరిన నేపథ్యంలో శనివారం తెగుళ్లు సోకిన వరి పైరును పరిశీలించారు. ప్రధానంగా అగ్గి తెగులు నివారణకు ఎకరాకు 120 గ్రాముల ట్రైసైక్లోజోల్ మందును, పాముపొడ తెగులు నివారణకు 400 మిల్లీ లీటర్ల హెక్సాకొనజోల్ ద్రావణం సరిపడా నీటిలో కలిపి తెగులు సోకిన పైర్లపై పిచికారీ చేసుకోవాలని రైతులకు ఏవో సూచించారు. సామూహిక సస్యరక్షణ చర్యలద్వారా తెగుళ్ల నివారణలో ఆశించిన ఫలితాలు లభిస్తాయన్నారు. ఏఈఓ బి.శ్రీకల్యాణ్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం



అరుణాచలం నాయుడు (ఫైల్)

నందిగాం: పెంటూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అట్టాడ అరుణాచలం నాయుడు (82) శనివారం మృతి చెందారు. కొద్ది రోజులుగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన నరసన్నపేట మండలం తోటూరులోని కుమారుడు ఇంటి వద్ద కన్నుమూశారు. అరుణాచలం నాయుడు తెంబూరు పీఏసీఎస్ ఉపాధ్యక్షుడిగా సేవలు అందించారు. ఈయన మృతిపై వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్, ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, నందిగాం సర్పంచ్ జడ్యాడ రమణమ్మ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కురమాన బాలకృష్ణారావు, పార్టీ ఎస్సీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు జడ్యాడ జయరాం, అంబోడి విష్ణు సంతాపం వ్యక్తం చేశారు.

ఆక్వా ల్యాబ్ సందర్శించిన విద్యార్థులు



అగ్రిల్యాబ్ సందర్శనలో విద్యార్థులు

సోంపేట: సోంపేట పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ ఆక్వా ల్యాబ్‌ను సోంపేట సంస్కార భారతి కళాశాలకు చెందిన బీఎస్సీ, సీబీజెడ్ తృతీయ సంవత్సరం విద్యార్థులు శనివారం సందర్శించారు. ల్యాబ్‌లో ఉన్న నీరు, మట్టి, శిక్షణ విశ్లేషణ పరీక్షల గురించి అధ్యాపకులు విద్యార్థులకు తెలియజేశారు. ల్యాబ్ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు వివరించారు. మత్స్యశాఖాధికారి కె.రవికుమార్ మాట్లాడుతూ కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాలకు చెందిన మత్స్యకారులు, ఆక్వా రైతులు ప్రభుత్వం నిర్వహిస్తున్న ల్యాబ్ సేవలు వినియోగించుకోవాలన్నారు. ఎఫ్‌డీవో ధర్మరాజు, ల్యాబ్ అసిస్టెంట్ ఎల్.కుమారస్వామి, అధ్యాపకులు, మత్స్యశాఖ సిబ్బంది ఉన్నారు.

అక్షరాస్యత శాతం పెంచండి

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వ అమలు చేస్తున్న అక్షరాంధ్ర ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలో అక్షరాస్యత శాతం పెంచాలని ఎంపీడీవో నడిమింటి రమేష్ నాయుడు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉల్లాస్ వలంటీర్లకు రెండు రోజులు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంద రోజుల కార్యక్రమంలో గ్రామస్థాయి నిరక్షరాస్యులను శతశాతం అక్షరాస్యులుగా చేయాలని కోరారు. ఈఓపీఆర్డీ డి.తిరుమలరావు, రిసోర్సుపర్సన్‌లు కంచరాన జయరాం, గున్న సుభాష్, ఏపీఎం జి.ప్రసాదరావు పాల్గొన్నారు.

పనికి తగిన వేతనాలివ్వాలి

పలాస: పలాస రైల్వే రన్నింగ్ రూమ్‌లో పనిచేస్తున్న కార్మికులు పనికి తగిన వేతనాలు ఇవ్వాలని, బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం నిరసన ప్రదర్శన చేశారు. కార్మికులు కృష్ణకుమారి, భానుప్రియ, జగదీష్ మాట్లాడుతూ కార్మికులందరికీ చార్ట్ ప్రకారం జీతాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 15 ఏళ్లకు పైగా రన్నింగ్ రూమ్‌లో పనిచేస్తున్నామని, ఒక్కో సారి రెండు షిఫ్టులు పనిచేస్తామని చెప్పారు. డబుల్ డ్యూటీ చేసిన వారికి తగిన వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటి గడపే పాఠశాల!

- శిథిలమైన లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల భవనం
- పరాయి పంచన తరగతుల నిర్వహణ



ఇంటి గడపలో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం



శిథిలమైన ప్రాథమిక పాఠశాల భవనం

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి పంచాయతీ లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో విద్యార్థుల చదువులు పరాయి పంచన సాగుతున్నాయి. ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు 25 మంది విద్యార్థులు ఉన్నారు. రెండు బిల్డింగులు ఉన్నప్పటికీ అందులో ఒకటి శిథిలావస్థలో ఉండగా మరొకటి డీపీఈపీ నిధులతో నిర్మించిన చిన్న భవనం. శిథిలమైన భవనాన్ని మండల విద్యాశాఖ అధికారులు పూర్తిగా మూసివేశారు. దీంతో విద్యార్థుల చదువులకు ఆటకంగా మారింది. ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు ఇబ్బందిగా మారడంతో గ్రామంలోని ఓ కుటుంబానికి చెందిన ఇంటి గడపలో తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. వర్షం పడితే గడపలోకి కూడా నీరు చేరుతుండడంతో పిల్లలు నానా అవస్థలు పడుతున్నారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఉన్న చిన్న భవనంలోనే చదువులు సాగిస్తున్నారు. పాఠశాల సమస్యను చాలాసార్లు విద్యాశాఖ అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. దీంతో గత్యంతరం లేక పరాయి పంచన విద్యార్థులకు తరగతులు నిర్వహించాల్సి వస్తోందని ప్రధానోపాధ్యాయుడు రెడ్డి సూరిబాబు, ఉపాధ్యాయురాలు సావిత్రమ్మలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవనాన్ని మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

సంతబొమ్మాళి మండలంలో 12 పాఠశాలలకు భవనాల మంజూరుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అందులో లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల భవనం కూడా ఉంది. మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– జి.చిన్నవాబు, ఎంఈవో, సంతబొమ్మాళి

పరిశుభ్రంగా సముద్ర తీరం



సోంపేట: బారువ తీరాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థులు



కవిటి: తీరప్రాంత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సోంపేట: సముద్ర తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు అన్నారు. అంతర్జాతీయ సముద్రతీర ప్రాంత పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం బారువ తీరంలోని పరిసరాలను పరిశుభ్రం చేశారు. సముద్రానికి హాని కలిగించే ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్పు చక్రధర్, అటవీశాఖ కాశీబుగ్గ రేంజర్ మురళీకృష్ణం నాయుడు, మెరైన్ సీఐ రమేష్, అటవీశాఖ సిబ్బంది సంతోష్, లక్ష్మణ్, ట్రీ ఫౌండేషన్ కన్వీనర్ సోమేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపాలెంలో తీరంలో..

కవిటి: కొత్తపాలెంలోని కేజీబీవీ విద్యార్థినులు, స్థానిక మత్స్యకారుల ఆధ్వర్యంలో స్వచ్ఛసాగర్-సురక్షిత్ సాగర్ కార్యక్రమం నిర్వహించారు. కొత్తపాలెం తీరంలో సుమారు కిలో మీటరు విస్తీర్ణంలో ఉన్న ప్లాస్టిక్, వ్యర్థాలు తొలగించి శుభ్రం చేశారు. వీటన్నింటినీ దూరంగా తరలించి నిప్పంటించి తగులబెట్టారు. తీరం పరిశుభ్రతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బారువ మెరైన్ పోలీస్ సిబ్బంది, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటివేత

పలాస: వాహనాలు నడుపుతున్న ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి కాలుష్య నివారణకు సహకరించాలని గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ చెప్పారు. పలాస ఆర్టీసీ డిపో ఆవరణలో శనివారం కదంబ, బాదం, చెర్రీ, మామిడి మొక్కలను నాటారు. డిపో మేనేజరు ఎం.ఎస్ .ఎస్.నాయుడు, ఆర్మీ సభ్యులు మల్ల మోతీలాల్, మెకానిక్ హేమంత్, హెడ్ గార్డు రామ్మోహనరావు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఉషారాణి

వజ్రపుకొత్తూరు: రైతులకు యూరియా పంపిణీలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు జల్లు ఉషారాణి అన్నారు. రైతుల ఉసురు ప్రభుత్వానికి తప్పకుండా తగులుతోందన్నారు. పూండిలో విలేకరులతో శనివారం ఆమె మాట్లాడారు. రైతు సేవా కేంద్రాల్లో నిల్వ ఉంచాల్సిన యూరియా సీజన్ దాటిపోయినా అందకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సినంత యూరియాను సరఫరా చేయడంతో పాటు ప్రైవేటు ఏజెన్సీల్లో సైతం అందులోబాటులోకి తీసుకువచ్చారని గుర్తు చేశారు. యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించడంలో సైతం ప్రభుత్వం విఫలమైందని అన్నారు. యూరియాను తక్షణమే అందులోబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. టోకెన్ల పంపిణీ, యూరియా సరఫరాలో కూటమి నాయకులు జోక్యం చేసుకుని పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. కణితివూరు, ఇతర ప్రాంతాల్లో బ్లాక్‌న బస్తా రూ. 500 నుంచి రూ. 800 వరకు విక్రయాలు చేపడితే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. యూరియా దొరక్క కొంతమంది ఒడిశా వెళ్లి కొనుగోలు చేసిన పరిస్థితులు ఉత్పన్నం కావడం బాధాకరమన్నారు.

విద్యార్థినులకు రక్త పరీక్షలు తప్పనిసరి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

పలాస: విద్యార్థినులు తప్పనిసరిగా రక్తపరీక్షలు చేయించుకోవడంతోపాటు రక్తహీనత ఉంటే పౌష్టికాహారం తీసుకోవాలని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి అన్నారు. కళాశాలలో క్యాన్సర్ వ్యాధి పట్ల శనివారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. పలాస పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు దివాకర్, సీహెచ్ ధనలక్ష్మి, వాణిశ్రీ, ఏఎన్ఎంలు కె.సంగీత, రేవతి, పుష్ప, సిమ్మమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 120 మంది విద్యార్థినులకు హిమోగ్లోబిన్, రక్తపోటు, సుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్లాస్ క్లబ్, ఉమెన్ ఎంపవర్‌మెంటు సెల్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఎస్.గణపతిరావు, శ్రీనివాస్ పట్నాయక్, పి.వెంకటరమణ, బి.నర్సింహులు, డాక్టర్ గిరిజ పాల్గొన్నారు.

జిల్లా మహాసభలు విజయవంతం చేయాలి



సోంపేటలో ప్రచారం చేస్తున్న సీఐటీయూ నాయకులు

సోంపేట: సోంపేట పట్టణంలో అక్టోబర్ 4, 5 తేదీల్లో జరగనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, ఎస్.లక్ష్మీనారాయణ కోరారు. సోంపేటలో శనివారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మహాసభల్లో కార్మిక, వర్తక, వ్యాపార సంఘాల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మండల కన్వీనర్ పి.చిరంజీవి, వరుణ్ కుమార్, శ్రీను పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఆర్థికసాయం



సాయాన్ని అందజేస్తున్న నారాయణస్వామి

కవిటి: పెద్దకర్రివానిపాలెం గ్రామానికి చెందిన యువకుడు గుడాల జగన్నాథం ప్రమాదవశాత్తు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న బెజ్జిపుట్టుగ సర్పంచ్ ఎస్‌పీ నారాయణస్వామి పెద్దకర్రివానిపాలెం శనివారం వెళ్లి బాధితుడ్ని పరామర్శించి తనవంతుగా రూ. ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు. వైస్ ఎంపీపీ కర్రి గోపయ్య, ధనంజయం, గ్రామపెద్దలు ఉన్నారు.

వయోజన విద్యతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న కమిషనర్ రమేష్

ఇచ్ఛాపురం: వయోజన విద్యతో సామాజిక, ఆర్థికాభివృద్ధి సాధ్యమని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ అన్నారు. నూతన విద్యా విధానంలో భాగంగా వయోజన విద్యను అందించడానికి ప్రభుత్వం అక్షరాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా మండలస్థాయి వయోజన విద్యా వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వయోజన విద్యతో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉందన్నారు. రీసోర్స్ పర్సన్లుగా కె.చంద్రశేఖర్, కె.సాయి రాహుల్ వ్యవహరించగా.. మెప్మా టీఎంసీ బి.భాస్కరరావు, సీఓ సంతోష్ పాల్గొన్నారు.

చదువుపై అవగాహన పెంచాలి



మాట్లాడుతున్న కూర్మారావు

మందస: ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరాక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో వై.వెంకటరమణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉల్లాస్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరాక్ష్యరాస్యులను చదువుపై శ్రద్ధచూపేలా అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో ఎ.తిరుమలకుమార్, ఏపీఎం పైడి కూర్మారావు, ఏసీఎం బి.హరికృష్ణ పాల్గొన్నారు.

ఉత్సవానికి వేళాయె..

- రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు
- ఇచ్ఛాపురం పట్టణంలో నాలుగు చోట్ల ఉత్సవాలకు ఏర్పాట్లు
- సుందరంగా స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం



తుదిమెరుగులు దిద్దుకుంటున్న దుర్గామాత అమ్మవారి విగ్రహం



స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం


ఇచ్ఛాపురం: శరన్నవ రాత్రి ఉత్సవాలకు ఇచ్ఛాపురం పట్టణం ముస్తాబవుతుంది. ఈ నెల 22 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు జరగనున్న ఉత్సవాల కోసం కమిటీ సభ్యులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా ఇచ్ఛాపురం ఇలవేల్పు, గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారు ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. అలాగే కాళీమాతా ఆలయం, గాయత్రిదేవి మండపం, ఫకీర్‌పేట ట్రైయాంగిల్ కూడలిలో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేలా కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ఉదయం నాలుగు గంటలకే ఆలయ గర్భగుడిలో అమ్మవారికి అభిషేకాలు, తైల మర్దన, సింధూర మర్దన పూజా, అలంకరణ, సహస్రనామార్చన, ప్రత్యేక హారతులను ఆలయ పూజారులు నిర్వహిస్తారు. అనంతరం పదిగంటల నుంచి హోమ మండపం వద్ద ప్రతిష్ఠించిన దుర్గామాతాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, దేవీ సప్తశతి పారాయణం వంటి ప్రత్యేక పూజలు ఉంటాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులు అమ్మవారిని తొమ్మిది రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. అలాగే ఫకీర్‌పేట ట్రైయాంగిల్ కూడలిలోని మండపం వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత, డబ్బూరు వీధిలో దక్షిణ కాళీమాతా ఆలయం వద్ద కాళీమాత, ఎంఎం దియేటర్ నీలాపువీధిలో గాయత్రిదేవి ఆరాధన పీఠం వద్ద గాయత్రి దేవి ప్రత్యేక పూజలందుకుంటారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా మధ్యాహ్నం గ్రామదేవత ఆలయం, దేవి నవరాత్రి ఉత్సవ మండపాల ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుంది. విజయదశమి రోజున పూర్ణాహుతితో పూజా కార్యక్రమాలను పూర్తిచేస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పూజా కమిటీ సభ్యులు తెలిపారు.

పూర్వ విద్యార్థికి సత్కారం



ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి మోడల్ ప్రైమరీ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి ఆనంద్‌ను సిబ్బంది ఘనంగా సత్కరించారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ మాట్లాడుతూ.. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు శిథిలావస్థలో ఉన్న దేవతామూర్తుల విగ్రహాలకు ఆనంద్ మరమ్మతులు చేపట్టారని గుర్తు చేశారు. ఇటువంటి పూర్వ విద్యార్థులు పాఠశాలకు ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధర్మరాజు, శాంతమణి, అనూరాధ, చంద్రామణి పాల్గొన్నారు. –ఇచ్ఛాపురం రూరల్

‘ఉల్లాస్’తో అక్షరాస్యత



ఉల్లాస్ శిక్షణతో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది శతశాతం అక్షరాస్యత సాధించాలని కంచిలి మండలాధ్యక్షుడు పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉల్లాస్ రెండో రోజు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తిచేసిన వలంటీర్లకు పుస్తకాలను ఎంపీపీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రస్వామి, ఏపీఎం అప్పలనర్సమ్మ, ఏపీవో ధనుంజయ పాల్గొన్నారు. – కంచిలి

ప్రజలు భాగస్వాములు కావాలి



పలాస-కాశీబుగ్గ పట్టణ సుందరీకరణలో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు పిలుపు నిచ్చారు. శనివారం ‘స్వచ్ఛతోత్సవ్’ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రదేశాలను శుభ్రం చేసి అక్కడ చెత్త వేయకుండా రంగులతో ముగ్గులు వేసి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రీన్ ఏపీ కింద మొక్కలను నాటారు. పలాస నెహ్రూ పార్కు, పలాస జీడి పిక్క బొమ్మ, కాశీబుగ్గ సంత మైదానం వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టారు. శానిటేషన్ , ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక ప్రజలతో కలిసి ర్యాలీ చేసి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. –పలాస

రిజిస్ట్రేషన్ కార్యాలయం వెలవెల!



ఖాళీగా ఉన్న కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

వజ్రపుకొత్తూరు రూరల్: కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని, రిజిస్ట్రేషన్ దస్తావేజులో దొర్లే తప్పులను సవరణ చేసుకొనే వెసులుబాటు కల్పించడంతో పాటు పాత విధానాన్ని కొనసాగించాలని కోరుతూ ఏపీ దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం పిలుపు మేరకు దస్తావేజు లేఖరులు రెండు రోజులుగా పెన్ డౌన్ చేపడుతున్నారు. దీంతో కాశీబుగ్గ మున్సిపాలిటీలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో భూ రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయి. భూములను క్రయ విక్రయాలు చేసే వారు లేకపోవడంతో కార్యాలయం వెలవెలబోతుంది. రోజూ సరాసరి 14 నుంచి 17 వరకు రిజిస్ట్రేషన్‌లు జరిగేవని కార్యాలయ సిబ్బంది తెలిపారు. అయితే దస్తావేజు లేఖరుల నిరసనతో రోజుకు కేవలం రెండు లేదా మూడు వివాహ రిజిస్ట్రేషన్‌లు మాత్రమే జరుగుతున్నాయని చెప్పారు.

దివ్యాంగ పిల్లలకు నిర్ధారణ పరీక్షలు



మాట్లాడుతున్న గోవిందరావు

పలాస: కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం దివ్యాంగు పిల్లలకు నిర్ధారణ పరీక్షలు చేశారు. పలాస, మందస, కొత్తూరు మండలాలకు చెందిన 105 మంది దివ్యాంగు పిల్లలు నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో 75 మంది దివ్యాంగులకు కొన్ని రకాల వీల్ చైర్లు, ట్రైసైకిళ్లు, చెవిటి మిషన్లు తదితర వాటి కోసం నిర్ధారణ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ బి.గోవిందరావు, అసిస్టెంటు ఐఈ కోఆర్డినేటర్ వి.ఉమా, ప్రధానోపాధ్యాయులు చిన్నం నాయుడు, ఎంఈవో శ్రీనివాసరావు, సీహెచ్ సత్యం, ఎం.లక్ష్మణరావు, ఐఈడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందీ భాషను విస్తరింపజేయాలి



హిందీ ఉపాధ్యాయుడును సత్కరిస్తున్న సిబ్బంది

వజ్రపుకొత్తూరు రూరల్: జాతీయ భాష హిందీని దేశమంతటా విస్తరింప చేయాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. హిందీ భాష పక్షోత్సవాల సందర్భంగా పల్లిసారధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. హిందీ కవుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు హిందీ ప్రాముఖ్యతను వివరించారు. చిన్నారులకు హిందీ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు అందజేశారు. హిందీ ఉపాధ్యాయులను సత్కరించి గౌరవించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.కాంతరావు, పీఎంసీ చైర్మన్ దున్న కవిత, ఉపాధ్యాయులు ఎస్.విష్ణుమూర్తి, ఎస్.పాపారావు, గుంట కోదండరావు, కె.మాధవరావు, బి.అన్నపూర్ణ, ఎం.హరినాథ్, సీతమ్మ ఉన్నారు.

కర్షకులకు కొనసాగుతున్న కష్టాలు

- పుటియాదళలో కాలిపోయిన మరో ట్రాన్స్‌ఫార్మర్



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సిబ్బంది, రైతులు

కవిటి: పుటియాదళ గ్రామ పరిధిలో వ్యవసాయ విద్యుత్ లైన్‌లో మరో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. కర్షకులకు కరెంట్ కష్టాలు అన్న శీర్షికన బుధవారం సాక్షిలో ఇదే సమస్యపై కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. శనివారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పెద్ద శబ్దం రావడంతో రైతులు విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ శంకర్, సహాయక సిబ్బంది పలు రకాల విద్యుత్ పరికరాలు తెచ్చి ట్రాన్స్‌ఫార్మర్ పనితీరును తనిఖీ చేశారు. వరిపైరు బిర్రుపొట్ట, పొట్టదశలో ఉన్న తరుణంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పరిమితికి మించిన స్థాయిలో కనెక్షన్లు ఉండటం వల్ల ఈ పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.